నమస్తే తెలంగాణ

# జగిత్యాల

5 | కరీంనగర్, గురువారం 14 నవంబర్ 2024 | JAGTIAL


## ప్రజా సమస్యలపై నిలదీస్తాం

- రైతుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తాం
- పాదయాత్రతో ప్రభుత్వాన్ని కదిలించాం
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- పాదయాత్ర విజయవంతంపై ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు



మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల/ మారుతీనగర్, నవంబర్ 13 : రైతు సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తానని, ఎవరెన్ని విమర్శలు చేసినా తగ్గేదిలేదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల స్పష్టం చేశారు. ప్రతిపక్ష హోదాను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ధైర్యంగా నిలదీస్తామని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్నీ కష్టాలేనని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సమస్యలు ప్రభుత్వానికి నివేదించేందుకు పాదయాత్ర చేపట్టామని, ప్రభుత్వాన్ని కదిలించామని, పరిష్కారం లభిస్తుందన్న నమ్మకం కలిగిందన్నారు. పార్టీలకతీతంగా పాదయాత్రను విజయవంతం చేసిన రైతులతోపాటు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేసులు, పగలు, పైరవీలతో పాలనను పక్కన పెట్టారని, విద్య, వ్యవసాయ రంగాలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. ధాన్యం కొనుగోళ్లపై చిత్తశుద్ధి లేదని, సన్నబియ్యం కొన్న దాఖలాలు లేవని మండిపడ్డారు. జగిత్యాల జిల్లాలో గతేడాది బీఆర్‌ఎస్ పాలనలో 4 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు జరిగితే, ఈ సీజన్‌లో ఇప్పటి వరకు కేవలం 30 వేల క్వింటాళ్లే కొన్నారని చెప్పారు. రైతులు ఇప్పటికే దళారులను ఆశ్రయించి 2 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకొని ₹100 కోట్లు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పాదయాత్ర ద్వారా రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకతను వ్యక్తం చేశారని, అప్పుడెలా ఉండే.. ఇప్పుడిలా అయిందని తమ గోడును వెల్లబోసుకున్నారని వివరించారు. ప్రజలపై ప్రేమ, జవాబుదారీతనంతో సమస్యలను తెలుసుకునేందుకే పాదయాత్ర చేశానని, కానీ, రాజకీయాల కోసం చేసే అవసరం లేదన్నారు. పాదయాత్ర సందర్భంగా కోరుట్లలో కార్యకర్తలు ఏర్పాటు చేసిన ప్లెక్సీలు, బ్యానర్లను తొలగించడంపై మండిపడ్డారు. కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసిన వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, మెట్‌పల్లి మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, కౌన్సిలర్ పురుషోత్తం, కోరుట్ల నియోజకవర్గ యూత్ నేత ఒజ్జెల శ్రీనివాస్, మల్లాపూర్ మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కోరుట్ల పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఫహీం, మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, నాయకులు చీటి వెంకటరావు, కాశిరెడ్డి మోహన్‌రెడ్డి, అన్వర్, అస్లాం, పొట్ట సురేందర్, గంగాధర్, నవీన్ పాల్గొన్నారు.

## 'సర్వే సిబ్బందిపై పనిభారం సరికాదు'

కలెక్టరేట్, నవంబర్ 13: సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో పాల్గొంటున్న ఎన్యుమరేటర్లు, సిబ్బందిపై అధిక పనిభారం మోపడం సరికాదని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రాజ్‌మహ్మద్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రోజుకు 12కిపైగా ఇండ్ల సర్వే చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. ఒక్కో ఫారం పూర్తిగా నింపేందుకు కనీసం గంటకు పైగా సమయం పడుతుందని.. రోజంతా ఏడు నుంచి ఎనిమిది మాత్రమే పూర్తవుతున్నాయని చెప్పారు. మరోవైపు ఇండ్ల యజమానులు కూడా పూర్తి వివరాలు చెప్పేందుకు సంపూర్ణంగా సహకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో 15 రోజుల్లోనే సర్వే పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం సమంజసం కాదన్నారు. క్షేత్రస్థాయి ఇబ్బందులు, ఒక్కో ఇంటికి పడుతున్న సమయాన్ని పట్టించుకోకుండా టార్గెట్లు విధించడం బాధాకరమన్నారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఉదయం పాఠశాలకు వెళ్లి, మధ్యాహ్నం నుంచి సర్వే చేస్తుంటే కనీసం ఐదారుకు మించి కావడం లేదన్నారు. శీతాకాలం కావడంతో ఐదు గంటలకే చీకటి పడుతున్నా, రాత్రి ఎనిమిది గంటల దాకా మహిళా ఎన్యుమరేటర్లు సర్వేలో పాల్గొంటున్నారని తెలిపారు. సర్వే చేసేందుకు మరింత మందిని తీసుకుంటే ఇబ్బందులు తలెత్తేవి కాదన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి సర్వేలో పాల్గొంటున్న గణకులకు సహాయకులను అందించాలని కోరారు.

## మూడు నెలల జీతమివ్వండి



సిరిసిల్ల ప్రభుత్వ ప్రధాన దవాఖానలో ఎమర్జెన్సీ ద్వారం వద్ద ధర్నా చేస్తున్న సిబ్బంది

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): 'మూడు నెలల నుంచి జీతాల్లేవు. ఎట్ల బతకాలె. కుటుంబాలను ఎట్ల పోషించుకోవాలె. పైగా అదనపు పనిభారంతో ఇబ్బందిపడుతున్నాం' అంటూ సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధానలో పారిశుధ్య సిబ్బంది రోడ్డెక్కారు. ఈ మేరకు బుధవారం విధులు బహిష్కరించి దవాఖాన ఎదుట నిరసన తెలిపారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించి, పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడుతూ, జీతాలు ఇవ్వకుండా సర్కారు వెట్టిచాకిరీ చేయించడంతో కార్మికుల కుటుంబాలకు పొట్టగడవని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందారు. 300 పడకలున్న దవాఖానలో సుమారు 150 మంది సిబ్బంది ఉండాలని, కానీ, సగం మందిని కూడా నియమించకుండా రెట్టింపు పని చేయిస్తున్నారని ఆరోపించారు. మెడికల్ కళాశాలలో కూడా పని చేయిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు.

# కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా కదలని ఫైలు?

బాధితుడు రిటైర్డ్ ఆర్టీవో ఏ లక్ష్మయ్య



### భూ సమస్య పరిష్కారం కోసం ఓ రిటైర్డ్ ఆర్టీవో తిప్పలు

- యజమానికి తెలియకుండా, వేలి ముద్ర లేకుండానే ధరణి నుంచి భూమి తొలగింపు
- తప్పు చేసి ముప్పు తిప్పులు పెడుతున్న అధికారులు!
- రెండేళ్లుగా బాధితుడి ప్రదక్షిణలు
- సీఎం నుంచి సీసీఎల్‌ఏ వరకు దరఖాస్తు
- అయినా కనికరం కరువు
- కలెక్టర్, ఆర్డీవోలు లేఖలు రాసినా స్పందించని గంగాధర రెవెన్యూ ఆఫీసర్లు

పక్క చిత్రంలో కనిపిస్తున్న ఆయన పేరు ఏ లక్ష్మయ్య.. రిటైర్డ్ ఆర్టీవో.. డ్యూటీలో ఉండగా పలుసార్లు ఉత్తమ అధికారిగా అవార్డులు అందుకున్నాడు. కానీ, నిజజీవితంలో మాత్రం రెవెన్యూ అధికారుల (లీలలు) చేతిలో ఓటమి పాలవుతున్నాడు. తనతోపాటు తన కుటుంబసభ్యుల వ్యవసాయ భూమికి సంబంధించి రికార్డుల్లో తప్పులు దొర్లాయని, తనకు తెలియకుండానే ధరణి నుంచి తన కుటుంబసభ్యుల 4.20 ఎకరాల వ్యవసాయ భూమి తగ్గించారని, వాటిని సవరించి న్యాయం చేయాలంటూ రెండేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. సీఎం నుంచి సీసీఎల్‌ఏ వరకు దరఖాస్తులు పెడుతూ వస్తున్నాడు. కేవలం రికార్డులను సరిచేస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుంది. కానీ, రెండేళ్లుగా తిరుగుతున్నా.. సదరు భూమి మోఖాపై లక్ష్మయ్య కుటుంబ సభ్యులే ఉన్నా రెవెన్యూ అధికారులు మాత్రం కనికరం చూపడం లేదు. ఈ తప్పులన్నీ వారే చేసినా రికార్డులను సరిదిద్దడం లేదు. చివరకు ప్రస్తుత కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీవో మహేశ్వర్ స్పందించి మేలో లేఖ రాసినా.. నేటికి గంగాధర మండల రెవెన్యూ అధికారులు మాత్రం స్పందించడం లేదు. రేపు మాపంటూ ముప్పు తిప్పలు పెడుతుంటే సదరు రిటైర్డ్ ఆర్టీవో చేయని తప్పుకు రెండేళ్లుగా కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్న తీరు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తున్నది.

కరీంనగర్, నవంబర్ 13 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్ జిల్లా గంగాధర మండలం న్యాలకొండపల్లె గ్రామంలోని సర్వేనంబర్ 148లోని 15 ఎకరాల భూమిని రిటైర్డ్ ఆర్టీవో ఏ లక్ష్మయ్య కుటుంబసభ్యులు నాలుగు దశాబ్దాలకు ముందే కొనుగోలు చేశారు. లక్ష్మయ్య భార్య రమాదేవిపై తొమ్మిది ఎకరాలు, అతడి కొడుకులు నవీన్‌కుమార్‌పై మూడెకరాలు, ప్రవీణ్‌కుమార్‌పై మూడెకరాల భూమిని కొని, రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆ తర్వాత నవీన్‌కుమార్ చనిపోగా, ఆయన పేరుపై ఉన్న మూడెకరాల భూమి విసరాసత్ ద్వారా తండ్రి లక్ష్మయ్య పేరుపైకి రాగా.. ఆ స్థలాన్ని ప్రవీణ్‌కుమార్ పేరుపై (డాక్యుమెంట్ నంబర్ 411/1999) రిజిస్ట్రేషన్ చేశాడు. దీంతో ప్రవీణ్‌కుమార్ ఆరెకరాలకు యజమాని అయ్యాడు. కాగా, వీరి భూమి నుంచే కరీంనగర్–జగిత్యాల రైల్వే లైన్ వెళ్లడంతో రమాదేవి స్థలం నుంచి 3.25 ఎకరాలు, ప్రవీణ్‌కుమార్ స్థలం నుంచి 39 గుంటలు అంటే మొత్తం 4.24ఎకరాలు పోయింది. ఆ మేరకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేసి, పరిహారం కూడా చెల్లించారు. ఆ స్థలాన్ని పాత పట్టాదారు పాసుపుస్తకంతోపాటు రికార్డుల నుంచి తొలగించారు. రైల్వే లైన్ కింద పోయిన స్థలాన్ని మినహాయిస్తూ రమాదేవిపై 5.15 ఎకరాలు, ప్రవీణ్‌కుమార్ పేరుపై 5.01 ఎకరాలను చూపుతూ ధరణిలో నమోదు చేయడంతోపాటు ఆ మేరకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు (రమాదేవి పేరుతో పాస్ బుక్‌నంబర్ టీ 17040150119 అలాగే ప్రవీణ్ కుమార్ పేరుతో టీ 17040150059 జారీ చేశారు) ఇచ్చారు. ఇక్కడి వరకు వ్యవస్థ అంతా నిబంధనల ప్రకారమే నడిచింది.

### రెవెన్యూ అధికారుల లీలలు



మోఖా మీద ఉండడంతోపాటు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు రావడం, ధరణి రికార్డుల్లోనూ ఆ సమయంలో అంతా సవ్యంగా ఉండడంతో లక్ష్మయ్య కుటుంబ సభ్యులు వ్యవసాయం కొనసాగిస్తూ వస్తున్నారు. మధ్యలో ఒక అవసర నిమిత్తం ధరణి సైట్‌లోకి వెళ్లి చూస్తే ఏ రమాదేవి పేరుపై 5.15 ఎకరాలు ఉండాల్సిన చోట 1.30 ఎకరాలు మాత్రమే కనిపిస్తున్నది. అంటే 3.25 ఎకరాల స్థలాన్ని ఆమె ఖాతా నుంచి తగ్గించారు. అలాగే ప్రవీణ్‌కుమార్ పేరుపై 5.01 ఎకరాలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ధరణి సైట్‌లో చూస్తే 4.06 ఎకరాలు మాత్రమే ఉన్నది. అంటే 35 గుంటల స్థలాన్ని ధరణి నుంచి డీలీట్ చేశారు. లక్ష్మయ్య కుటుంబ సభ్యులకు సంబంధించి రైల్వే లైన్‌కింద 4.24 ఎకరాల స్థలం పోగా, రమాదేవి, ప్రవీణ్‌కుమార్ స్వాధీనంలో ఇంకా 10.16 ఎకరాలు వ్యవసాయ భూమి ఉండాలి. కానీ, ప్రస్తుతం ధరణిలో మాత్రం ఇద్దరిది కలిపి 5.36 ఎకరాలు మాత్రమే కనిపిస్తున్నది. నిజానికి ఇంకా వీరికి 4.20 ఎకరాలు కలువాల్సి ఉన్నది. ధరణి నిబంధనల ప్రకారం చూస్తే.. ఒకసారి కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం జారీ అయిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ యజమాని వేలిముద్ర లేకుండా భూముల్లో మార్పులు చేర్పులు చేయడానికి వీలులేదు. కానీ, ఇక్కడ మాత్రం అధికారులు ఆ నిబంధనలను తుంగలో తొక్కి, భూములను ఏకం గా రికార్డుల్లో తగ్గించారు. యజమానులకు కనీస సమాచారం ఇవ్వలేదు. కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు విడుదలైన తర్వాత వారి నోటీసులో లేకుండా, అలాగే వేలి ముద్రలు లేకుండా భూములను రెవెన్యూ అధికారులు ఎలా మార్పు చేశారన్న ప్రశ్న ప్రస్తుతం ఉత్పన్నమవుతున్నది. దీనిని బట్టి రెవెన్యూ అధికారులు ఏదైనా చేయగల సమర్థులన్న విషయం తేటతెల్లం అవుతున్నది. ఈ తప్పులు ఇంతటితో ఆగలేదు. లక్ష్మయ్య భూముల తగ్గింపు వ్యవహారంలో అధికారులు మరో లీల చూపారు. నిజానికి చనిపోయిన కొడుకు నుంచి విరాసత్ ద్వారా సక్రమించిన మూడెకరాల భూమిని చిన్న కొడుకు ప్రవీణ్‌కుమార్‌పై తండ్రి లక్ష్మయ్య 1999లోనే గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశాడు. ఆమేరకు పాత పట్టాదారు పాసుపుస్తకాల్లో లక్ష్మయ్య పేరును తొలగించారు. అయితే ధరణి వచ్చిన సమయంలో తిరిగి తన పేరుపైనే ఆ మూడెకరాల భూమి ఉన్నట్టు రికార్డుల్లో నమోదైనట్టు గుర్తించిన లక్ష్మయ్య తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. తన పేరుపై ఉన్న భూమిని తన కొడుకు ప్రవీణ్‌కుమార్‌కు రిజిస్ట్రేషన్ చేశానని, ధరణి రికార్డుల నుంచి తన పేరును తొలగించాలని దరఖాస్తులో కోరడంతో అప్పుడు అధికారులు తొలగించారు. కానీ, తీరా చూస్తే ఇప్పుడు మళ్లీ లక్ష్మయ్య పేరుపైనే మూడెకరాల భూమి ధరణిలో కనిపిస్తున్నది.

### కలెక్టర్ ఆదేశించినా స్పందన శూన్యం

తన పేరుపై ఉన్న మూడెకరాలను కొడుకు పేరుపైకి మార్చడంతోపాటు గతంలో జారీచేసిన కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలకు అనుగుణంగా రికార్డులను సరిదిద్ది తనకు న్యాయం చేయాలని లక్ష్మయ్య రెండేళ్లుగా పోరాటం చేస్తున్నాడు. జరిగిన తప్పులను సవరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ నుంచి ముఖ్యమంత్రి.. సీసీఎల్‌ఏ వరకు దరఖాస్తులు చేశాడు. అంతేకాదు, మొత్తం స్థలం మోఖాపై తమ కుటుంబమే ఉందని, కేవలం అధికారులు చేసిన తప్పులను సరిదిద్దితే తనకు న్యాయం జరుగుతుందని పేర్కొంటూ లేఖలు రాయడంతోపాటు ఆధారాలను జతచేసి అధికారులకు అనేకసార్లు పంపాడు. చివరకు ధరణి సైట్‌లో ఇచ్చిన ఆప్షన్లను వినియోగించుకొని.. 2022 డిసెంబర్ 31న కరెక్షన్ కోసం రెండుసార్లు ఆన్‌లైన్ (అప్లికేషన్ నంబర్స్ 2200178547 అలాగే 2200178522)లో దరఖాస్తు చేశాడు. అయినా న్యాయం జరగలేదు. కాగా, ఫిబ్రవరి 7న లక్ష్మయ్య దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ పమేలా సత్పతి (లేఖ నంబర్ ఈ3/1143/2024 తేదీ 4.05.2024) ఆర్డీవోకు ఉత్తర్వులు జారీ చేశారు. అర్జీదారుడి వివరాలు పరిశీలించి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ మేరకు కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ వెంటనే స్పందించి, గంగాధర తహసీల్దార్‌కు మే6న లేఖ (నంబర్ డీ1/3158/2004) రాశారు. అర్జీదారుడు పేర్కొన్న అంశాలపై విచారణ చేసి, అసంబద్ధంగా తొలగించిన (డిడెక్షన్) వాటిని కరెక్షన్ చేసి, రిపోర్ట్ పంపాలని ఆర్డీవో తన లేఖలో స్పష్టం చేశారు. కానీ, నేటి వరకు అతీగతీ లేదు. గంగాధర రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు ఆర్డీవో పంపిన లేఖపై స్పందించిన దాఖలాలు లేవు. రేపు మాపు అంటూ.. రిటైర్డ్ ఆర్టీవోను తిప్పుకోవడమే తప్ప న్యాయంచేసే దిశగా మాత్రం అడుగులు వేయడం లేదు. అయినా న్యాయబద్ధంగా తన కుటుంబ సభ్యులకు రావాల్సిన హక్కుల కోసం లక్ష్మయ్య పోరాటం చేస్తూనే ఉన్నాడు. ఆర్డీవో లేఖపై గంగాధర రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంతో ధరణిలో ఆగస్టు 14న ఒకసారి (నంబర్ 2400081406), సెప్టెంబర్9న మరోసారి (నంబర్ 2400094203) దరఖాస్తు చేశాడు. పలుసార్లు ప్రజావాణిలోనూ దరఖాస్తు చేశాడు. నిజానికి జరిగిన తప్పులను సరిదిద్దడానికి ధరణిలో స్పష్టమైన ఆప్షన్ ఉన్నది. అధికారులు అనుకుంటే 48 గంటల్లో సరిదిద్ది అర్జీదారుడికి న్యాయం చేయవచ్చు. కానీ, కలెక్టర్, ఆర్డీవో ఆదేశించినా సదరు మండలం నుంచి ఫైలు కదలడం లేదంటే.. క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 'కాసులు లేకుండా ఫైలు కదపరు' అన్న ఆరోపణలను ఎదుర్కొంటున్న రెవెన్యూ అధికారులు.. లక్ష్మయ్య విషయంలోనూ అదే ఆలోచనలో ఉన్నారా..? లేక పై అధికారుల ఆదేశాల మేరకు తప్పులను సరిదిద్ది న్యాయం చేస్తారా..? అన్నది వేచి చూడాల్సి ఉన్నది. కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకొని న్యాయం చేయాలని బాధిత కుటుంబం కోరుతుండగా, రెండేళ్లుగా తిరుగుతున్నా పని కాకపోవడంతో లక్ష్మయ్య మానసిక ఒత్తిడికి లోనవుతున్నాడు. ఈ ప్రభావం అతడి ఆరోగ్యంపై పడడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఎమ్మెల్సీ కవిత హయాంలోనే జగిత్యాల అభివృద్ధి

- ఆమె కృషితోనే రోళ్లవాగు ఆధునీకరణకు శ్రీకారం
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్



బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్ట్ వద్ద రైతులతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్

సారంగాపూర్, నవంబర్ 13 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎంపీగా ఉన్నప్పుడే జగిత్యాల జిల్లాగా ఏర్పడి, అభివృద్ధి సాధించిందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ గుర్తు చేశారు. పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్నప్పుడు ఆమె చేసిన కృషితో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రోళ్లవాగు ఆధునీకరణకు శ్రీకారం చుట్టిందని స్పష్టం చేశారు. మళ్లీ అభివృద్ధి కోసం జగిత్యాల ప్రాంతానికి కవిత రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్ట్‌ను బుధవారం సాయంత్రం బీఆర్‌ఎస్ నాయకులు, స్థానిక రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ ప్రాంత రైతులు బాధలు పడుతుండడం చూసి రోళ్లవాగును సందర్శించానని చెప్పారు. ఉమ్మడి సారంగాపూర్ మండలంలో సాగు, తాగు నీటికి ఇబ్బందులు పడుతున్న రైతులకు రోళ్లవాగు ప్రాజెక్ట్‌తో కవిత వెన్నుదన్నుగా నిలిచారని చెప్పారు. తాను పదవిలో లేకున్నా కేసీఆర్‌తో మాట్లాడి ప్రాజెక్ట్‌ను ఆధునీకరించడానికి ₹135 కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. 99శాతం పనులు కేసీఆర్ నాయకత్వంలో కవిత ఆధ్వర్యంలో పూర్తయ్యాయని గుర్తు చేశారు. కానీ, పదకొండు నెలల పాలనలో కనీసం ఒక్క షటర్ కూడా బిగించలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. షటర్లు లేక నీటి ప్రవాహం వస్తున్నదని, దీంతో పొలాలు తడిగా మారి హార్వెస్టర్లు రావడానికి ఇబ్బందిగా మారిందన్నారు. కోతలకు కూలీ చెల్లించలేక రైతులు ఇబ్బందులు పండుతున్నారని ఆవేదన చెందారు. కవిత ఉండుంటే ఈ గోసలు ఉండేవి కావని రైతులు బాధపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మిగిలిపోయిన షటర్ల బిగింపు పనులు చేయాలని, యాసంగి పంటలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని డిమాండ్ చేశారు. కవిత హయాంలోనే జగిత్యాల నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని చెప్పారు. ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేందుకు జగిత్యాలలో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసిన ఘనత ఆమెకు దక్కుతుందని కొనియాడారు. బీర్‌పూర్ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి ₹30 లక్షల నిధులు కేటాయించారని తెలిపారు. స్థానిక రైతులు అప్పటి ఎంపీ కవితకు రాజుల చెరువు గురించి వివరించి, సామర్థ్యం పెంచాలని కోరగా వెంటనే స్పందించి ₹65 కోట్లతో ఆధునీకరణ పనులు ప్రారంభించారని గుర్తు చేశారు. శిలాఫలకాలను ప్రారంభించచడం మాత్రమే ఎమ్మెల్యే చేశారని, నిధుల కోసం కవిత కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, ప్యాక్స్ మాజీ చైర్మన్ మెరుగు రాజేశం, పాయకులు సతీశ్, సుధాకర్, వెంకటేశ్, సుదర్శన్, చంద్రయ్య, అశోక్, రాజన్న, రాజేందర్, పోశాలు, రైతులు పాల్గొన్నారు.

## విదేశాల్లో ఉద్యోగావకాశాలు

జగిత్యాల రూరల్, నవంబర్ 13: యూఏఈలో బైక్ రైడర్స్ డెలివరీ బాయ్ ఉద్యోగాల కోసం టామ్‌కామ్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని జగిత్యాల జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న జిల్లాకేంద్రంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ఉంటుందని చెప్పారు. యూఏఈలో బైక్ రైడర్స్ ఉద్యోగాలకు నెలకు ₹60వేల వేతనం ఇస్తారన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈనెల 16న జగిత్యాలలోని మున్సిపాల్ పార్క్ ఎదుట శుభమస్తు కన్వెన్షన్ హాల్‌లో ఉన్న ఆనంద భవన్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2వరకు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. అలాగే గ్రీస్ దేశంలో కూడా వివిధ ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9440051285, 9440048500 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## మంథని ఎమ్మెల్యే దగాకోరు

- నేషనల్ హైవే నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నడు
- ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ₹50 లక్షల పరిహారం ఇప్పించాలి
- ప్రజలను మోసం చేసినందుకు కాంగ్రెస్ నాయకులపై 420 కేసు పెట్టాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

పెద్దపల్లి, నవంబర్ 13(నమస్తే తెలంగాణ): అనేక అబద్ధాలు, మోసపూరిత మాటలతో గెలిచిన మంథని ఎమ్మెల్యే దగాకోరు, మోసగాడు అని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఘాటుగా విమర్శించారు. ఆయన నేషనల్ హైవే నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నాడని మండిపడ్డారు. ఆనాడు లేఖ రాస్తే ప్రజలు నమ్మారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర పరిధిలో లేదు.. కేంద్రం పరిధిలో ఉందంటూ దాటవేస్తున్నాడని విమర్శించారు. ఆ ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే ఎకరాకు ₹50 లక్షలు ఇప్పించాలని, ఇండ్లకు సరైన కొలతలు తీసి నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ హైవే నిర్మాణంలో మంథని నియోజకవర్గంలో వందల ఎకరాల్లో భూములు పోతున్నాయని, పుట్టపాక ప్రధాన రహదారి పక్కనే ఉన్న భూములకు ప్రస్తుతం ఎకరానికి ₹కోటి ధర పలుకుతుందన్నారు. గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో మాజీ ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత మంథని ఎమ్మెల్యే ఎకరాకు ₹25 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రికి లేఖ రాశాడని గుర్తు చేశారు. అయితే కేంద్రానికి ఎవరైనా తెలుగులో లేఖ రాస్తారా..? అని ఎద్దేవా చేశారు. ప్రజలను మభ్యపెట్టేందుకే ఇలా చేశాడని విమర్శించారు. అసలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ లేఖ విషయాన్నే మరిచిపోయాడని మండిపడ్డారు. ఆయన విద్యావంతుడని, మేధావి అంటూ గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోనే ఉందని, మంథని ఎమ్మెల్యే, మంత్రి హోదాలో ఉండి కూడా ఇప్పటి వరకు నేషనల్ హైవే నిర్వాసితులకు న్యాయం చేయాలనే ఆలోచన చేయలేదని, కనీసం కలెక్టర్‌తో సమీక్ష చేయలేదని విమర్శించారు. లగచర్ల ఘటనలో కుట్ర జరిగిందని, ఎవరినీ వదిలిపెట్టమని ప్రకటనలు చేయడం కాదని, నిర్వాసితులకు న్యాయం చేయాలనే ఆలోచన చేయాలని హితవు పలికారు. నిర్వాసితుల్లో రైతులే కాదు, ఎంతో మంది కాంగ్రెస్ వాళ్లు ఉన్నారని వివరించారు. కేసులు పెట్టాల్సి వస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మొత్తం కేబినెట్, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులపై పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలను మోసం చేసినందుకు 420 కేసు పెట్టాలన్నారు. పెద్దపల్లి కలెక్టర్ సైతం నిర్వాసితులకు న్యాయం చేసేలా చూడాలని, ఎమ్మెల్యే చెప్పినట్లు చేస్తామని ఆయన చెబుతున్న మాటలు వింటే ప్రజల తిరుగుబాటు తప్పదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించి ఫీల్డ్‌లోకి రావాలని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గుజ్జుల రాజిరెడ్డి, అత్తె చంద్రమౌళి, బెల్లంకొండ ప్రకాశ్‌రెడ్డి, నూనె కుమార్, సుదాటి రవీందర్‌రావు, కాపురబోయిన భాస్కర్, పెగడ శ్రీనివాస్, రొడ్డ శ్రీనివాస్, మధు పాల్గొన్నారు.





